క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరణ



సీపీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఐ , ఏసీపీ

ఖమ్మంక్రైం: ఖమ్మం టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా సత్యనారాయణ, మహిళ పోలీస్ స్టేషన్ సీఐగా చిట్టిబాబులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వారు సీపీ సునీల్‌దత్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు వేయింగ్ మిషన్లు..



వేయింగ్ మిషన్లు అందిస్తున్న కార్పొరేటర్

ఖమ్మంమయూరిసెంటర్: అంగన్‌వాడీల్లోని చిన్నారులు, బాలింతలు, గర్భిణీల సౌకర్యార్థం 46వ డివిజన్ కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ డిజిటల్ వేయింగ్ మిషన్లను గురువారం వితరణగా అందజేశారు. కార్పొరేటర్ తన జన్మదినం సందర్భంగా తన డివిజన్‌లోని ఏడు అంగన్‌వాడీలకు మిషన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ వీరభద్రమ్మ, సూపర్‌వైజర్ సత్యశీల, అంగన్‌వాడీటీచర్లు, నాయకులు కన్నం ప్రసన్నకృష్ణ, షేక్ రజ్జి, బాల్దే నాగేశ్వరరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మల నివాళి

కామేపల్లి: ఓబీసీ జిల్లా అధ్యక్షుడు, కామేపల్లి పీఏసీఎస్ చైర్మన్ పుచ్చకాయల వీరభద్రం తల్లి అచ్చమ్మ ఇటీవల మృతి చెందగా.. గురువారం తాళ్లగూడెంలో వారి నివాసంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సందర్శించి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖమ్మం ఏఎంసీ చైర్మన్ హన్మంతరావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, గింజల నరసింహారెడ్డి, నల్లమోతు లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

ఎరువుల కొరత రానివ్వొద్దు

కూసుమంచి: రైతులకు కొరత లేకుండా ఎరువులు అందించాలని జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య సూచించారు. గురువారం కూసుమంచిలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన విత్తన, ఎరువుల డీలర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డీలర్లు విత్తన, ఎరువుల విక్రయాలకు లైసెన్స్‌లు కలిగి ఉండాలని, క్రయ, విక్రయాల స్టాక్ బోర్డులను ప్రదర్శించాలని, విక్రయాలను రిజిస్టర్‌లో పొందుపర్చాలని, ఫార్మర్ రిజిస్ట్రీని వేగవతం చేయాలని, పామాయిల్ సాగును ప్రోత్సహించాలని సూచించారు. కృత్రిమ కొరత సృష్టిస్తే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏడీఏ సరిత, ఏఓలు వాణి, అరుణ పాల్గొన్నారు.

పచ్చిరొట్ట కలియదున్నాలి



రైతులకు వివరిస్తున్న ఏఓ తారాదేవి

కామేపల్లి: భూసారం పెంపునకు రైతులు పచ్చిరొట్టను 45 రోజుల్లోగా భూమిలో కలియదున్నాలని మండల వ్యవసాయాధికారి భూక్యా తారాదేవి అన్నారు. గురువారం సాతానిగూడెంలో పచ్చిరొట్ట వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు.

అభిషేకాలు.. అన్నదానాలు

ఖమంగాంధీచౌక్: గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా గురువారం షిర్డీ సాయి మందిరాలు, ఆశ్రమాల్లో సాయినాథునికి ప్రత్యేక అభిషేకాలు, హోమాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. బాబాకు తేనెతో అభిషేకం చేసి గ్రామోత్సవం(ఊరేగింపు) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్లు వేములపల్లి వెంకటేశ్వరరావు, లగడపాటి రామారావు, కార్యదర్శులు అర్వపల్లి నిరంజన్, సిద్ధంశెట్టి నాగమణి, కోశాధికారి కురువెళ్ల జగన్మోహన్‌రావు, మధుసూదన్‌రావు, మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

ఖమ్మం మామిళ్లగూడెం: సీపీఎం ఖమ్మం టూటౌన్ కమిటీ ఆధ్వర్యాన ఈనెల 5న మొదటి శనివారం ఖమ్మం మంచికంటి హాల్‌లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని జయప్రదం చేయాలని సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, బీవీకే మేనేజర్ వై.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటలకు వరకు జరిగే ఈ క్యాంపులో బీపీ, షుగర్ తదితర సమస్యలపై ఉచితంగా పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేయనుండగా.. ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు.

అపాయం.. అప్రమత్తం



కరుణగిరి సెంటర్ వద్ద రోడ్డుపై వెళ్తున్న వాహనాలు

ప్రమాదాలకు నిలయంగా కరుణగిరి సెంటర్

- మితిమీరుతున్న వాహనాల వేగం
- భయాందోళనలో వాహనదారులు
- నివారణ చర్యలు చేపట్టని అధికారులు

ఖమ్మంరూరల్: రూరల్ మండలం పెదతండా పరిధిలోని కరుణగిరి సెంటర్‌లో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతూ ప్రమాదాలకు నిలయంగా మారింది. వరంగల్, విజయవాడ, హైదరాబాద్, రాజమండ్రి వైపు వెళ్లే లారీలు, వివిధ రకాల వాహనాలు ఈ రహదారిపై రాకపోకలు సాగిస్తుండగా.. మితిమీరిన వేగంతో వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నాయి. అయితే ఈ వాహనాల వేగాన్ని నియంత్రించడానికి అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడంతో ప్రమాదాలకు అడ్డాగా మారింది. కనీసం స్పీడ్ బ్రేకర్లు కూడా ఏర్పాటు చేయకపోవడం గమనార్హం.

నివారణ చర్యలు శూన్యం..

ఈ రోడ్డు సమీపాన టీఎన్జీవోస్ కాలనీ, రాజీవ్ గృహకల్ప, గణేష్‌నగర్, సత్యనారాయణపురం, పలు గ్రామాల నుంచి ఖమ్మంలోని వివిధ ప్రైవేట్ పాఠశాలలకు చెందిన బస్సులు, విద్యార్థుల తల్లిదండ్రులు వారిని పాఠశాలలకు తీసుకెళ్లడం, తీసుకురావడం , వివిధ పనుల నిమిత్తం ఇతరులు రాకపోకలు సాగిస్తున్న క్రమాన ప్రమాదాలకు గురవుతున్నారు. ఇంత రద్దీ ప్రాంతంలో అధికారులు ముందే జాగ్రత్త పడి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారనే ఆరోపణలున్నాయి.

ప్లాస్టిక్ స్తంభాల తొలగింపు..

గతంలో కరుణగిరి సెంటర్ నుంచి ఖమ్మం నగరం వరకు మున్నేరు ఆవల రోడ్డు మధ్యలో ప్లాస్టిక్ స్తంభాలను ఉంచారు. అయితే ప్రస్తుతం అక్కడ వాటిని తీసేయడంతో వాహనాలు అడ్డదిడ్డంగా వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నాయి. పెరుగుతున్న రద్దీ రీత్యా నాయుడుపేట సర్కిల్ నుంచి కరుణగిరి సెంటర్‌కు డివైడర్లు ఏర్పాటు చేసి సెంట్రల్ లైటింగ్ పెడితే కొంతవరకైనా ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంది. ఇదే విషయమై కొందరు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా డివైడర్లు, సెంట్రల్ లైటింగ్‌కు నిధులు కేటాయించారు. వీటి నిర్మాణంతో ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

నిత్యం ప్రమాదాలు..

ఇదిలా ఉండగా మితిమీరిన వేగంతో వాహనాలు వెళ్తుండడంతో నిత్యం ప్రమాదాలు జరగడం, పలువురు మృతి చెందడం, క్షతగాత్రులు కావడం నిత్యకృత్యమైంది. ఇందులో

- గతేడాది క్రితం ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు తన ఇద్దరు పిల్లలను కళాశాలలో దిగబెట్టడానికి ద్విచక్రవాహనంపై వెళుతుండగా కరుణగిరి సెంటర్ వద్ద వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో అతని కుమారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి, కూతురుకు తీవ్ర గాయాలయ్యాయి. ఇప్పటికీ ఆ ప్రభుత్వ ఉపాధ్యాయుడు కోలుకోక ఇంటి వద్దనే ఉంటున్నాడు.
- ఇదే ప్రాంతంలో ఓ ప్రైవేట్ స్కూల్ విద్యార్థి స్కూల్ బస్సు దిగి నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా.. వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.
- ఇటీవల రెండు ద్విచక్ర వాహనాలు బలంగా ఢీకొనడంతో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. ఇలా చెప్పుకుంటూపోతే ఈ సెంటర్‌లో జరిగిన ప్రమాదాలు కోకొల్లుగా ఉన్నాయి.

చర్యలు తీసుకుంటాం..

కరుణగిరి సెంటర్‌లో ప్రమాదాలు జరగకుండా ఇప్పటికే చర్యలు తీసుకుంటున్నాం. అక్కడ వాహనాల తనిఖీ చేపట్టడం, మితిమీరిన వేగంతో వెళ్తున్న వాహనాలకు జరిమానాలు విధిస్తున్నాం. మున్ముందు కూడా ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటాం.

– ముష్కరాజు,రూరల్ సీఐ

మంత్రి పొంగులేటికి వినతి

తిరుమలాయపాలెంలో ఐటీఐ నిర్మించాలని..

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని హైవే పక్కన అనువుగా ఉన్న సర్వే నంబర్ 254లో గల 9.11 ప్రభుత్వ భూమిలో నూతనంగా మంజూరైన ఏటీసీని నిర్మించాలని కోరుతూ గురువారం కూసుమంచిలో మండల అఖిల పక్షం నాయకుల ఆధ్వర్యాన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఖమ్మం టూ వరంగల్ హైవే పక్కన ఉన్న భూమిలో నిర్మించాలని కోరగా.. మంత్రి ఏటీసీ నిర్మాణానికి హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ పాలేరు అసెంబ్లీ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్నబోయిన రమేష్‌యాదవ్, కొమ్ము పూలే బీఆర్ఎస్ మండల నాయకులు గుగ్గిల అశోక్, గద్దల మన్మధరావు, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు, పగిడిపల్లి బాబు, వంగూరి మధు, కొమ్ము నితీష్, నేలమర్రి యేసు, బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలని..

ఖమ్మం మామిళ్లగూడెం: ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యాన గురువారం తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి క్యాంప్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి గోకినపల్లి మస్తాన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయకుండా రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వినతి అందించిన వారిలో నాయకులు అజయ్, మణికంఠ, విజయ్, అఖి, తదితరులు పాల్గొన్నారు.



తిరుమలాయపాలెం: మంత్రి పొంగులేటికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

బకాయిలు చెల్లించాలని నిరసన

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని జార్జిరెడ్డి పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మందా సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 48గంటల విద్యాసంస్థల బంద్ సందర్భంగా గురువారం ఖమ్మంలోని విద్యాసంస్థలను బంద్ చేయించి ఖమ్మం మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులతో నిరసన తెలిపారు. ఖమ్మం జిల్లా గరల్స్ కన్వీనర్ పైండ్ల శ్యామల, నాయకులు రాము, జంపన్న, చరణ్, సల్మాన్‌రాజ్, వీరబాబు, వెంకటేష్, లక్ష్మణ్, సాయి, చాను, సోహెల్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ ఉద్యోగుల నిరసన



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఖమ్మంవ్యవసాయం: మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి భాస్కర్‌పై ఆ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దాడి చేశారని పేర్కొంటూ ఉమ్మడి ఖమం జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీల ఉద్యోగులు గురువారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. టీఎన్జీవోస్ మార్కెట్ కమిటీ ఎంప్లాయీస్ కేంద్ర కమిటీ పిలుపు మేరకు ఉమ్మడి జిల్లాలోని ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు టి.కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఎండీ హిమాయిత్ హుస్సేన్(బబ్లూ), ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శులు చంద్రశేఖర్, పంతులునాయక్, జి.సత్యనారాయణ, జగదీష్, వి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కవి మాల్యాశ్రీకి పురస్కారం

ఖమ్మంగాంధీచౌక్: కవి మాల్యాశ్రీకి భోగోజు పురుషోత్తం–సముద్రమ్మ స్మారక సాహితీ పురస్కారం వరించినట్లు వురిమళ్ల ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వురిమళ్ల సునంద, భోగోజు ఉపేందర్‌లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫౌండేషన్ ఇటీవల నిర్వహించిన కథలు, కవితల పోటీల్లో ప్రగతి చూపగా.. ఫౌండేషన్ వార్షికోత్సవంలో రూ. 10 వేల నగదు అందించి సత్కరించనున్నట్లు తెలిపారు. అలాగే కథల పోటీల్లో ప్రథమ బహుమతిగా ఇల్లెందుకు చెందిన రంగనాథ్ సుదర్శన్‌కు రూ. 5 వేలు, ద్వితీయ బహుమతి హైదరాబాద్‌కు చెందిన ఎస్వీ కృష్ణకు రూ. 4 వేలు, తృతీయ బహుమతి గుంటూరుకు చెందిన హేమలతకు రూ. 3 వేలతో పాటు మరికొందరికి బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. కవితల పోటీల్లో ప్రథమ బహుమతిగా జగిత్యాలకు చెందిన చిందం రమేష్‌కు రూ.4 వేలు, ద్వితీయ బహుమతి కాకినాడకు చెందిన పాత్తూరి సీతారామరాజుకు రూ. 3 వేలు, తృతీయ బహుమతి నెల్లూరుకు చెందిన అవ్వారు శ్రీధర్‌బాబుకు రూ. 2వేలతో పాటు మరికొందరికి ప్రోత్సాహక బహుమతులు అందించనున్నట్లు తెలిపారు.

సన్మానం..



జ్యోతిని సన్మానిస్తున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు

ఖమ్మ మామిళ్లగూడెం: ఖమ్మం కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారిణి జ్యోతిని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యాన గురువారం కలిసి ఘనంగా సత్కరించి మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ మాట్లాడుతూ.. పూలే జయంతి నాటికి ఆయన చిత్రపటాలను జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు అందిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెడేపల్లి కృష్ణమాచారి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పుల్లారావు, మహిళా విభాగం అధ్యక్షురాలు సుగుణ, ఖమ్మం నగర అధ్యక్షుడు వెంకటరామయ్య, రిటైర్డ్ హెచ్ఎం కృష్ణయ్య, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

వరదలపై ముందస్తు జాగ్రత్తలు అవసరం

ఖమ్మంమయూరిసెంటర్: వర్షాలు కురుస్తున్న నేపథ్యాన మున్నేరు వరదలపై అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. గురువారం కమిషనర్ కాల్వొడ్డు వద్ద మున్నేరు లోతట్టు ప్రాంతాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. వరదను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని, అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలించేలా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో వలంటీర్లను మొహరించాలని సూచించారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఈసారి వరదలు పోటెత్తకముందే ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆయన వెంట టౌన్‌ప్లానింగ్, శానిటేషన్ విభాగాల అధికారులు, వలంటీర్లు ఉన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న కమిషనర్

'కార్పొరేట్ శక్తుల మేలుకు మోదీ కుట్ర'

ఖమ్మంరూరల్: కార్పొరేట్ శక్తులకు మేలు చేసేందుకే ప్రధాని మోదీ ప్రభుత్వం నాలుగు అసంఘటిత చట్టాలను రద్దు చేసిందని రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు మిడకంటి చినవెంకటరెడ్డి అన్నారు. మండలంలోని వరంగల్‌క్రాస్‌రోడ్‌లో జరిగిన సంఘం కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను పక్కనపెట్టి కేవలం బడాబాబులకు దేశ సంపదను దోచి పెట్టేందుకు అనేక రకాల కుయుక్తులకు పాల్పడుతోందన్నారు. గతంలో పోరాటాల స్ఫూర్తితో అసంఘటిత చట్టాలను పునరుద్ధరించే వరకూ పోరాడాలన్నారు. అందులో భాగంగానే ఈనెల 9న దేశ వ్యాప్తంగా సార్వత్రిక సమ్మె నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు ఎం.సుదర్శన్‌రెడ్డి, మిడకంటి పెదవెంకటరెడ్డి, బొడ్డు ఉపేందర్, నిరంజన్‌రెడ్డి, వెంపటి సురేదర్, లక్ష్మి, స్వామి, ధనమూర్తి, రమేష్, రామయ్య పాల్గొన్నారు.

అత్యాచారాల కట్టడిలో పాలకులు విఫలం

ఖమ్మం మామిళ్లగూడెం: మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు అరికట్టాలని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) జిల్లా అధ్యక్షురాలు పోటు కళావతి, జిల్లా నాయకురాలు తాటి నిర్మల డిమాండ్ చేశారు. గురువారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. మైనర్లపై అత్యాచార ఘటనలు పెరిగిపోతున్నా కట్టడి చేయడంతో పాలకులు విఫలమయ్యారన్నారు. బోనకల్ మండలంలో మూడో తరగతి బాలికపై లైంగిక దాడి జరగగా, కామేపల్లి మండలంలో 15ఏళ్ల బాలిక గర్భం దాల్చడం శోచనీయమన్నారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి అత్యాచార నిందితులకు రోజుల్లోనే శిక్ష పడేవిధంగా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ రెండు ఘటనలకు సంబంధించి తక్షణం కేసులు నమోదు చేయడంతో పాటు మానవ హక్కుల సంఘాలు సుమోటాగా స్వీకరించి విచారించాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత

నేలకొండపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి 15 మందికి చెందిన కుటుంబాలకు పీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఒక్కో కుటుంబానికి అందించే రూ.10 వేలను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి పొంగులేటి చొరవతో ఆర్థిక సాయం అందించామని తెలుపుతూ శుక్రవారం హైదరాబాద్‌లో జరిగే కాంగ్రెస్ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, నాయకులు కొడాలి గోవిందరావు, దండా పుల్లయ్య, నర్సయ్య, పెంటమళ్ల పుల్లమ్మ, కొమ్మినేని పుష్పావతి, మేకల వెంకటేశ్వర్లు, బొడ్డు బొందయ్య, ఎం.వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

పీర్ల ప్రదర్శన..

పీర్ల పండుగను పురస్కరించుకుని 7వ రోజు (షరగత్) గురువారం ప్రదర్శన నిర్వహించారు. రిక్కా బజార్ ప్రాంతం నుంచి ఈ పీర్ల ప్రదర్శనను ముస్లింలు ప్రారంభించగా.. రిక్కా బజార్, కుమ్మరి బజార్, మేదర బజార్, చర్చి కాంపౌండ్ ప్రాంతాల మీదుగా ప్రదర్శన సాగింది. – ఖమ్మంమామిళ్లగూడెం



రిక్కాబజార్‌లో పీర్లను ప్రదర్శిస్తున్న ముస్లింలు

యూరియాను ఎమ్మార్పీకే విక్రయించాలి

నేలకొండపల్లి: యూరియాను స్థానిక రైతులకే విక్రయించాలని మండల వ్యవసాయాధికారి ఎం.రాధ సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో డీలర్లతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎరువులను అధిక ధరలకు విక్రయించినా, ఇతర ప్రాంతాల వారికి విక్రయించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పైనంపల్లి గ్రామంలో నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించారు. స్టాక్ వివరాలు బోర్డులో ప్రదర్శించాలని, విక్రయించిన వాటిని బిల్లులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డీలర్లు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, గెల్లా వెంకటేశ్వరరావు, రామలక్ష్మడు, సీతఓలు ఖమ్మం వెంకటేశ్వర్లు, జగదీష్, రైతు ప్రతినిధులు నాగేశ్వరరావు, భాస్కర్‌రెడ్డి, వై.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దాల నిరీక్షణకు తెర..

రఘునాథపాలెం: మండలంలో కోయచలక (రేగుల చలక) నుంచి కామంచికల్ గ్రామానికి మధ్యగల రహదారికి మహర్దశ పట్టింది. ఈ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రూ. 2.50కోట్లు నిధులు కేటాయించగా గురువారం ఉభయ గ్రామాల మాజీ ఉపసర్పంచులు ఎండపల్లి సత్యం, చెరుకూరి పూర్ణచంద్రరావు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఇకనుంచి ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల ప్రజల రాకపోకలకు మంచి వారధిగా ఈ రోడ్డు ఉపయోగపడుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ చెరుకూరి సీతారాములు, మాదంశెట్టి హనుమంతరావు, అమర అప్పారావు, ఎండపల్లి జగన్ మోహన్‌రావు, భూషయ్య తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనుల ప్రారంభంలో రైతులు, నాయకులు

ప్లాస్టిక్ బ్యాగ్ నివారణ దినోత్సవం



ఖమ్మంలో ర్యాలీ తీస్తున్న కేఎంసీ సిబ్బంది



కూసుమంచిలో ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది, విద్యార్థులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్లాస్టిక్ బ్యాగ్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నగర పాలక సంస్థ ఆధ్వర్యాన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించి ప్రత్యామ్నాయంగా పత్తి సంచులు, జూట్ బ్యాగుల వినియోగాన్ని ప్రోత్సహించాలని తెలిపారు. ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్‌తో పాటు శానిటరీ సూపర్‌వైజర్, ఇన్‌స్పెక్టర్, మెప్మా సిబ్బంది, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్, మున్సిపల్ సిబ్బంది, జవాన్లు పాల్గొన్నారు.

కూసుమంచిలో..

కూసుమంచి: ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారి ప్రాజెక్టు మేనేజర్ బాల సుబ్రహ్మణ్యం కోరారు. గురువారం నాయకన్‌గూడెం గ్రామంలో హైవే సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించి స్థానిక పాఠశాల విద్యార్థులచే ప్లాస్టిక్ నిర్మూలిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ప్రాజెక్టు ఇన్సిడెంట్ మేనేజర్ కొండలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకా మట్టి రోడ్లే దిక్కు..

అధ్వానంగా 7వ డివిజన్ అంతర్గత రహదారులు

- చినుకు పడితే చిత్తడిగా మారుతున్న వైనం
- నర(డ)కయాతన పడుతున్న స్థానికులు
- పన్నులు చెల్లిస్తున్నా అభివృద్ధి శూన్యం
- సీసీ రోడ్లు నిర్మించాలని వేడుకోలు



రోడ్డుపై గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

ఖమ్మంఅర్బన్: నగరంలోని ఏడో డివిజన్ శ్రీవెంకటేశ్వర గోశాల పరిధిలోని రహదారులు అధ్వానంగా మారాయి. పాలకులు కనీస మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో స్థానికులు నరకయాతన పడుతున్నారు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ఇళ్లు నిర్మించుకుని కార్పొరేషన్‌కు పన్నులు చెల్లిస్తున్నా అభివృద్ధికి నోచుకోవడం లేదని వాపోతున్నారు. ఒక వైపు అధికారులు, పాలకులు పచ్చదనం, పరిశుభ్రత ఉంటే రోగాలు దరిచేరవంటూ ప్రచారం చేస్తున్నారే తప్ప తమ బాధలను ఎవరూ తీర్చడం లేదంటున్నారు. నివాసాలు చుట్టూ ఉన్న అంతర్గత రహదారులన్నీ గోతులు, మట్టితో ఉండడంతో రాకపోకలు అసాధారణంగా మారాయి.

కనీస సదుపాయాలు కరువు..

పేరుకే ఖమ్మం నగరంలో ఉంటున్నామే కానీ మారుమూల గ్రామాలకంటే అధ్వానంగా ఉందని డివిజన్ వాసులు వాపోతున్నారు. కనీసం రోడ్లు, డ్రెయినేజీ సదుపాయం లేకపోవడం బాధాకరమని నివాసితులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఏడో డివిజన్ గోశాల పరిధిలో రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకోవడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

చినుకుపడితే చిత్తడే..

వర్షాకాలం ప్రారంభమైనందున ఏ చిన్న చినుకు పడినా రోడ్లపై నీరు నిలిచి పరిస్థితి మరింత దయనీయంగా మారుతోంది. నిత్యం పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, పనులకెళ్లే కార్మికులు, ఉద్యోగులు ఈ అధ్వాన రహదారులపైనే ప్రయాణించాల్సి వస్తోంది. ఈ విషయమై పలుమార్లు స్థానిక కార్పొరేటర్, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి స్పందన లేదని డివిజన్‌వాసులు ఆరోపిస్తున్నారు. ఇళ్లు నిర్మించుకున్నాం, పన్నులు చెల్లిస్తున్నాం కానీ రోడ్డు లేదు, డ్రెయినేజీ లేదు అంటూ వాపోతున్నారు.



ఇళ్ల ముందు ఇలా..

భారంగా ప్రయాణం..



రూ.లక్షలు ఖర్చు చేసి ఇల్లు నిర్మించాం. ప్రభుత్వానికి అన్ని రకాల పన్నులు చెల్లిస్తున్నాం కానీ మాకు కనీస సదుపాయాలు కల్పించడం లేదు. మా ఇంటి ముందున్న రోడ్లపై పగలే ప్రయాణం చేయడం కష్టంగా మారుతోంది. రాత్రయితే మా బాధలు వర్ణణాతీతం. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– చిట్టిమోతు శేఖర్‌రావు, నివాసి

ఇబ్బంది పడుతున్నాం..



మా ఇళ్ల ముందున్న రోడ్లు గుంతలతో అధ్వానంగా మారాయి. వర్షం వస్తే నీరు నిలిచి నడక కష్టంగా ఉంటుంది. అడపాదడపా వానలకే పరిస్థితి ఇలా ఉంటే ఈ వానాకాలంలో మా బాధలు ఎవరికి వర్ణణాతీతం. ఇలాంటి స్థితిలో వాహనాలతో రాకపోకలు సాగించడం యజ్ఞంలా మారింది.

– సీహెచ్.శ్రీరాం, నివాసి

బాగు చేయాలి..



7వ డివిజన్లలో అనేక అంతర్గత రహదార్లు దెబ్బతిన్నాయి. నీరు నిలిచి కంపుమయంగా తయారైంది. వర్షాలు తీవ్రం కాకముందే అధికారులు గుర్తించి తగు చర్యలు తీసుకుని నివాసులకు ఇబ్బంది లేకుండా మరమ్మతులు చేయడం లేదా కొత్త సీసీరోడ్లు నిర్మించాలి.

– పొదిలభూపతి, నివాసి